రాష్ట్రంలో ప్రజలకు సంక్షేమ పాలన

- విద్య, వైద్యానికి పెద్ద పీట
- ఎన్ని ఇబ్బందులు ఉన్నా పేదల పక్షాన నిలిచిన సీఎం జగనన్న
- మంత్రి జోగి రమేష్


కానూరులో డ్వాక్రా అక్క చెల్లెమ్మలకు చెక్కు అందజేస్తున్న మంత్రి జోగి రమేష్

పెనమలూరు: పాదయాత్రలో పేదలకు ఇచ్చిన హామీల మేరకు జగనన్న అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పాలన అందిస్తున్నారని, ప్రధానంగా విద్య, వైద్యానికి పెద్ద పీట వేశారని రాష్ట్ర గృహనిర్మాణ శాఖ మంత్రి, వైఎస్సార్ సీపీ పెనమలూరు నియోజకవర్గ సమన్వయకర్త జోగి రమేష్ అన్నారు. కానూరు వీఆర్ సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీ గ్రౌండ్స్‌లో బుధవారం అక్క చెల్లెమ్మలకు ఆసరా మహోత్సవంలో భాగంగా రుణాల మాఫీ చెక్కులు అందజేశారు. మంత్రి జోగి రమేష్ మాట్లాడుతూ.. దేశంలో ఏ రాష్ట్రంలో ముఖ్యమంత్రి అమలు చేయని విధంగా జగనన్న మాత్రమే సంక్షేమ పథకాలు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, ఈబీసీ వర్గాలకు రాజకీయాలకు అతీతంగా అమలు చేశారని తెలిపారు. అమ్మ ఒడి, ఆసరా, చేయూత, పింఛన్, ఆరోగ్యశ్రీ, ఫీజు రీయింబర్స్‌మెంట్, కాపు నేస్తం, ఈబీసీ నేస్తం, ఇలా అనేక సంక్షేమ పథకాలు మనసున్న జగనన్న మాత్రమే అందజేస్తున్నారు. జగనన్న పాలనలో పింఛన్ ప్రతి నెల 1వ తేదీన సచివాలయం సిబ్బంది, వలంటీర్లు ఇంటికి వచ్చి ఇస్తున్నారని, రేషన్ కూడా తలుపుతట్టి పంపిణీ చేస్తున్నారని చెప్పారు. పేద పిల్లలు కేజీ నుంచి పీజీ వరకు ఉచిత విద్య, విదేశీ విద్యకు రూ.1.25 కోట్లు సాయం అందిస్తున్నారన్నారు. ప్రజలు ఆరోగ్యవంతమైన జీవితం గడపటానికి ఆరోగ్య శ్రీ పరిమితి రూ.25 లక్షలకు పెంచారని చెప్పారు. పేదల చిరకాల కోరిక ఇళ్ల స్థలాలు ఇచ్చి ఇళ్లు కట్టించి ఆశలు జగనన్న నెరవేర్చారన్నారు. రాష్ట్రంలో ప్రతి పేద, మధ్య తరగతి ప్రజలు గుండెపై చేయివేసుకోని వాస్తవాలు ఆలోచించి, భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకోని వచ్చే ఎన్నికల్లో జగనన్నను తిరిగి గెలిపించాలని కోరారు.

పేదల పట్ల చంద్రబాబుకు కడుపు మంట..

రాష్ట్రంలో పేదల పట్ల చంద్రబాబుకు కడుపు మంట అని మంత్రి జోగి రమేష్ ఆరోపించారు. పేదలు అభివృద్ధి చెందుతుంటే చంద్రబాబు ఓర్వలేక పోతున్నాడని విమర్శించారు. ఇళ్ల స్థలాలు ఇస్తే కోర్టు కేసు వేశాడని, పేద పిల్లలు ఇంగ్లిష్ చదువు చెబుతామంటే చదవటానికి వీలు లేదని అడ్డు తగిలాడన్నారు. 14 సంవత్సరాలు ముఖ్యమంత్రిగా పని చేసిన చంద్రబాబు ఇప్పుడు ఏమి చేస్తాడో ప్రజలు ప్రశ్నించాలని అన్నారు. చంద్రబాబుకు తోడుగా దత్తపుత్రుడు పవన్‌కల్యాణ్ కలిసి జగనన్నను దించాలని కుట్ర పన్నుతున్నారని ఆరోపించారు. పేదల పక్షాన జగన్ నిలిచి వారి అభివృద్ధికి బాట వేసినందుకు తోడు దొంగలు కలిసి వస్తున్నారని వారికి ప్రజలు తగిన గుణపాఠం చెప్పాలని కోరారు. కార్యక్రమంలో కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు, డీసీసీబీ చైర్‌పర్సన్ తాతినేని పద్మావతి, కానూరు మాజీ సర్పంచ్‌లు అన్నే వేణుగోపాలకృష్ణమూర్తి, దేవభక్తుని సుబ్బారావు, వివిధ కార్పొరేషన్ డైరెక్టర్లు ఈడే చాముండేశ్వరి, పి.రాఘవరావు, గుమ్మడి విజయ్‌కుమార్, నేతలు వెలగపూడి వరప్రసాద్, మరీదు శ్రీనివాసరావు, వీరబాబు, కోసూరి నరేష్, కాకి శ్రీనివాసరావు, హక్, అష్రఫ్, యనమలకుదురు, తాడిగడపకు చెందిన డ్వాక్రా మహిళలు, పార్టీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తొలగిన 'ఇనాం' చిక్కుముడి

- వెంకటాపురం రైతులకు పట్టాదారు పాసుపుస్తకాలు
- వైఎస్సార్ సీపీ ప్రభుత్వ చొరవతో ఇనాం భూ సమస్యకు పరిష్కారం
- 400 మంది రైతులకు ఊరట


వెంకటాపురంలోని ఇనాం భూములు

హనుమాన్‌జంక్షన్‌రూరల్: ఐదు దశాబ్దాలుగా వేధిస్తున్న వెంకటాపురం ఇనాం భూముల సమస్య వైఎస్సార్ సీపీ ప్రభుత్వ చొరవతో పరిష్కారమైంది. ఈ నేపథ్యంలో గతేడాది జూలైలో కలెక్టర్ పి.రాజాబాబు ప్రత్యేక ఉత్తర్వులు జారీ చేయటంతో సెక్షన్ 22ఏ నిషేధిత భూముల జాబితా నుంచి ఈ భూములను తొలగించటంతో రైతుల సుదీర్ఘ నిరీక్షణ ఫలించింది. తాజాగా ఈ భూములను సాగు చేస్తున్న దాదాపు 400 మంది రైతులకు పట్టాదారు పాసుపుస్తకాలు కూడా జారీ కావటంతో వారిలో ఆనందోత్సవాలు వెల్లివిరిస్తున్నాయి.

ఎమ్మెల్యే వంశీ కృషితో..

బాపులపాడు మండలం వెంకటాపురంలో 489 ఎకరాలు రెవెన్యూ రికార్డుల్లో ఇనాం భూమిగా నమోదు కావటంతో రైతులు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. దశాబ్దాలుగా సిరివాడ గ్రామానికి చెందిన పేద రైతులు ఈ భూములను సాగు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. ఇనాం భూములను రద్దు చేస్తూ గతంలో చట్టం వచ్చినప్పటికీ వెంకటాపురం భూముల చిక్కుముడి వీడలేదు. దీంతో దశాబ్దాలుగా రైతులు రెవెన్యూ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో గన్నవరం ఎమ్మెల్యే వల్లభనేని వంశీ ప్రత్యేక చొరవ తీసుకుని వెంకటాపురం భూముల సమస్య పరిష్కారానికి కృషి చేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి ఈ సమస్యను తీసుకువెళ్లటంతో రెవెన్యూ యంత్రాంగంలో కదలిక వచ్చింది. గ్రామానికి సంబంధించిన రెవెన్యూ రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాత నిషేధిత భూముల జాబితా సెక్షన్ 22ఏ నుంచి వెంకటాపురం భూములను తొలగించారు.

పట్టాదారు పాసుపుస్తకాలు జారీ

దశాబ్దాలుగా వెంకటాపురం భూములకు సాగు చేస్తున్న రైతులకు భూమి రిజిస్ట్రేషన్లు, పట్టాదారు పాసుపుస్తకాలు, బ్యాంకు రుణాలు, ప్రభుత్వ రాయితీలు అందటం లేదు. ఈ నేపథ్యంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఈ భూముల సమస్యపై ప్రత్యేకంగా విచారణ చేపట్టి పరిష్కరించటంతో ఎట్టకేలకు రైతులకు పట్టాదారు పాసుపుస్తకాలు జారీ చేసింది. దాదాపు 400 మంది రైతులకు పట్టాదారు పాసుపుస్తకాలు ఇప్పటికే అందాయి. ఆ భూముల సాగుదారులకు అడంగల్, ఆర్‌ఓఆర్‌లను కూడా రెవెన్యూ అధికారులు అందించారు.

దశాబ్దాల భూ సమస్య పరిష్కారం



ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి, గన్నవరం ఎమ్మెల్యే వల్లభనేని వంశీ చొరవతో ఈ సమస్య పరిష్కారమైంది. ఎంతోకాలంగా ఇనాం భూములను సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాం. పట్టాదారు పాసుపుస్తకాలు మంజూరు చేయకపోవటంతో తీవ్ర ఇబ్బందులు పడ్డాం. ఇప్పుడు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం మాకు పట్టాలు జారీ చేసింది.

– రెల్లు అప్పారావు, రైతు

సీఎంకు, ఎమ్మెల్యేకు రుణపడి ఉంటాం..



ఇనాం భూములు సాగు చేస్తున్న పేద రైతుల జీవితాల్లో వెలుగులు నింపినందుకు కృతజ్ఞతలు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి దయ, ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్ చొరవతో ఇనాం భూములకు సమస్యకు పరిష్కారం లభించింది. ఇనాం భూముల సాగుదారులంతా సీఎం వైఎస్ జగన్, ఎమ్మెల్యే వంశీలకు రుణపడి ఉంటాం.

– సింగవరపు రామశివ నాగేశ్వరరావు, రైతు

ఈకేవైసీ నమోదు తప్పనిసరి



పెనమలూరు: మండల పరిధిలో పంటలు సాగు చేస్తున్న రైతులు తప్పనిసరిగా ఈకేవైసీ చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి కనకమేడల శైలజ తెలిపారు. ఆమె బుధవారం వివరాలు తెలుపుతూ రబీ సీజన్‌లో రైతులు వరి, జొన్న, మొక్కజొన్న పంటలు సాగు చేస్తున్నారన్నారు. ఇప్పటికే మండల పరిధిలో 1,721 హెక్టార్లలో పంటలు సాగు చేస్తున్న 908 మంది రైతులకు ఈ క్రాప్ నమోదు చేశామన్నారు. అయితే ఈకేవైసీ ప్రతి రైతు చేయించుకోవాలని తెలిపారు. ఆయా గ్రామాల్లో విలేజ్ అగ్రికల్చర్ అధికారి వద్ద ఈకేవైసీ చేయించుకోవాలన్నారు.

నేడు వైఎస్సార్ ఆసరా చెక్కుల పంపిణీ

పెనమలూరు: నియోజకవర్గ కేంద్రం పెనమలూరు గ్రామంలో గురువారం వైఎస్సార్ ఆసరా చెక్కుల పంపిణీ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మండల పరిషత్ ఏఓ లోయ శివశంకర్‌రావు తెలిపారు. ఆయన బుధవారం వివరాలు తెలుపుతూ గురువారం ఉదయం 10 గంటలకు పెనమలూరు జగనన్న హౌసింగ్‌కాలనీ వద్ద ఆసరా చెక్కులు పంపిణీ చేస్తామన్నారు. కార్యక్రమానికి రాష్ట్ర గృహనిర్మాణ శాఖ మంత్రి, వైఎస్సార్ సీపీ పెనమలూరు సమన్వయకర్త జోగి రమేష్ పాల్గొంటారన్నారు. పెనమలూరు, చోడవరం, వణుకూరు, గోసాల, గంగూరు, పెదపులిపాక గ్రామాలకు చెందిన డ్వాక్రా అక్కా చెల్లెమ్మలకు చెక్కులు ఇస్తారన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

ప్రజా సమస్యల పరిష్కారమే ప్రధాన ధ్యేయం


ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే వంశీమోహన్

గన్నవరం: ప్రజా సమస్యల పరిష్కారమే ప్రధాన ధ్యేయమని ఎమ్మెల్యే డాక్టర్ వల్లభనేని వంశీమోహన్ పేర్కొన్నారు. స్థానిక శాసనసభ్యుని కార్యాలయానికి బుధవారం ఆయన విచ్చేశారు. ఈ సందర్భంగా నాలుగు మండలాలకు చెందిన పలువురు ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు ఎమ్మెల్యేను కలిశారు. అదే విధంగా నియోజకవర్గంలోని వివిధ గ్రామాలకు చెందిన పెద్ద సంఖ్యలో ప్రజలు ఎమ్మెల్యే కార్యాలయానికి తరలివచ్చారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ప్రజల సమస్యలను ఎమ్మెల్యే స్వయంగా తెలుసుకున్నారు. సంబంధిత శాఖల అధికారులతో మాట్లాడి ప్రజా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకున్నారు.

ఘనంగా వసంత పంచమి వేడుకలు


దావాజిగూడెం రామాలయంలో విశేష అలంకరణలో అమ్మ వారు


జంక్షన్‌లో పూజలు నిర్వహిస్తున్న దాత నారాయణరావు దంపతులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు


చినకంచిలో చిన్నారులతో అక్షరాభ్యాసం చేయిస్తున్న తల్లిదండ్రులు

గన్నవరం: గన్నవరం, పెనమలూరు నియోజకవర్గాల వ్యాప్తంగా వసంత పంచమి వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. పలు ఆలయాల్లో సరస్వతీ దేవికి ప్రత్యేక పూజలు నిర్వహించి, చిన్నారులతో సామూహిక అక్షరాభ్యాసాలు చేపట్టారు. దీంతో ఆలయాల్లో కోలాహలం నెలకొంది. మండలంలోని దావాజిగూడెంలో వేంచేసి యున్న శ్రీసీతారామచంద్రస్వామి దేవస్థానంలో శ్రీపంచమి వేడుకలను జరిపారు. ఈ సందర్భంగా ఉపాలయంలోని శ్రీసరస్వతీదేవి అమ్మవారికి విశేష అర్చనలు, సువాసినులచే కుంకుమార్చనలు, చిన్నారులచే సామూహిక అక్షరాభ్యాసాలు చేయించారు. అనంతరం ఆలయ అర్చకులు ఎస్.రామాచార్యులు ఆధ్వర్యంలో భక్తులకు ప్రసాద వితరణ జరిపారు. పలువురు గ్రామ ప్రముఖులు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

జంక్షన్‌లో విశేష పూజలు

హనుమాన్‌జంక్షన్‌రూరల్: వసంత పంచమి పర్వదినాన్ని పురస్కరించుకుని బాపులపాడు మండలం కానుమోలు జెడ్పీ హైస్కూల్‌లోని సరస్వతి దేవి విగ్రహానికి బుధవారం విశేష పూజలు నిర్వహించారు. విగ్రహ దాత కళ్లేపల్లి నారాయణరావు, లక్ష్మీ దంపతులు చదువుల తల్లికి పూజా కార్యక్రమాలు చేశారు. అనంతరం విద్యార్థులకు అమ్మవారి ప్రసాదాన్ని పంపిణీ చేశారు. పాఠశాల హెచ్‌ఎం పద్మజా, దస్తావేజు లేఖరి నరహరిశెట్టి గంగాధరరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సామూహిక అక్షరాభ్యాసం

నున్న(విజయవాడరూరల్): నున్న గ్రామంలోని ప్రసిద్ధ దేవస్థానం చినకంచిలో గురుపరంపరా ప్రతిష్ఠలు, శ్రీచక్రమునకు విశేష అభిషేక అర్చనలు వేదపండితులు వైభవంగా నిర్వహించారు. చిన్నారులకు సామూహిక అక్షరభ్యాసాలను నిర్వహించారు. ఆలయ ట్రస్టీ మొక్కపాటి శర్మ దంపతుల ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు. నున్న గ్రామంలోని రేడియంట్ హైస్కూల్ నందు ప్రిన్సిపాల్ అవుతు మధుసూదనరెడ్డి ఆధ్వర్యంలో సరస్వతీ పూజా కార్యక్రమం అనంతరం 50 మంది చిన్నారులకు సామూహిక అక్షరభ్యాస కార్యక్రమాన్ని సాంప్రదాయబద్ధంగా నిర్వహించారు. శ్రీయోగీశ్వర్ దేవిదయాళ్ మందిరంలో శ్రీయోగీశ్వర్ రామ్‌లాల్ భగవాన్ నిత్యలీలా ప్రకాష్ ఉత్సవాలు, శ్రీ స్వామి అమిత్‌దేవ్‌జీ మహారాజ్ ఆధ్వర్యంలో పూజలు జరిగాయి. భక్తులకు అన్నదానం జరిగింది. చెరువు సెంటర్‌లో శ్రీకనకదుర్గ అమ్మవారి ఆలయంలో చిన్నారులకు సామూహిక అక్షరభ్యాసాలు జరిగాయి.

ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో పూజలు

పెనమలూరు: యనమలకుదురు గ్రామంలోని శ్రీసంతాన వేణుగోపాలస్వామివారి ఆలయంలో పెనమలూరు మండల ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో వసంత పంచమి సందర్భంగా సరస్వతీదేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజా కార్యక్రమంలో చిన్నారులు పాల్గొని కుంకుమ పూజ చేశారు. నోట్ పుస్తకాలు, పెన్నులు, ప్రసాదం పంపిణీ చేశారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు కొండవేటి బాబురావు, తటపర్తి సతీష్, బుద్దా లక్ష్మణకుమార్, కంచర్ల కిరణ్, మాధవరావు, వెంకటేశ్వరరావు, పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

అలరించిన శ్రీనివాస కల్యాణ గానామృతం


విశేష అలంకరణలో స్వామివారు

పెనమలూరు: కానూరు గ్రామంలోని శ్రీవేణుగోపాలస్వామివారి ఆలయంలో బుధవారం శ్రీనివాసకల్యాణ గానామృతం నిర్వహించారు. గుడివాడ నిర్మల స్వామి గానామృత భక్త బృందం ఆధ్వర్యంలో చేపట్టారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని గానామృతంతో పరవశించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త అన్నే సుజాత, వి.పద్మావతి, భక్తులు పాల్గొన్నారు.

పెదపులిపాకలో..

పెదపాలిపాక గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీవిజయరాజరాజేశ్వరి, శ్రీవిజయసుందరేశ్వరస్వామివారి దేవస్థానంలో చిన్నారులకు శ్రీ వాసుదేవానందగిరి స్వామీజీ అక్షరాభ్యాసం చేయించారు. పలకలు, పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని సరస్వతి అమ్మవారికి పూజలు చేశారు.

వైభవంగా దేవతామూర్తుల విగ్రహాల ప్రతిష్ఠ


శ్రీసరస్వతి అమ్మవారు


అభయాంజనేయస్వామి


ధ్వజస్తంభాన్ని ప్రతిష్ఠిస్తున్న గ్రామస్తులు

పెనమలూరు: గంగూరు గ్రామ పరిధి విజయ్ స్పిన్నింగ్ మిల్ ప్రాంగణంలో బుధవారం శ్రీ విద్యా సరస్వతి అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం ఘనంగా జరిగింది. వసంత పంచమి సందర్భంగా నూతనంగా నిర్మాణం చేసిన శ్రీ విద్యా సరస్వతి అమ్మవారి ఆలయంలో బుధవారం ఉదయం 10.15 గంటలకు శ్రీ సరస్వతి అమ్మవారి విగ్రహాన్ని, ధ్వజస్తంభాన్ని ప్రతిష్ఠించారు. దేవతి హోమం, పూర్ణాహుతి, శాంతికల్యాణం పలు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పూజల్లో పాల్గొన్నారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ ప్రాంగణంలో మధ్యాహ్నం 12 గంటలకు భక్తులకు అన్నసంతర్పణ చేశారు.

కొండపావులూరులో విగ్రహ ప్రతిష్ఠ

గన్నవరంరూరల్: మండలంలోని కొండపావులూరులో కొండపై ఉన్న శ్రీ దత్త వెంకటేశ్వర అభయాంజనేయస్వామి ఆలయంలో బుధవారం కార్యసిద్ధి అభయాంజనేయస్వామి ఏకశిల విగ్రహ ప్రతిష్ఠ భక్తుల కోలాహలం మధ్య వైభవంగా జరిగింది. శ్రీ దత్త విజయానంద తీర్థ స్వామీజీ చేతుల మీదుగా ప్రతిష్ఠ కార్యక్రమం నిర్వహించారు. ఉదయం యంత్ర స్థాపన, శ్రీ చక్రార్చన, అనుగ్రహ భాషణం అనంతరం అభిషేకం, కుంభాభిషేకం జరిగాయి. వందలాది మంది భక్తులకు అన్నసంతర్పణ చేశారు. ఆలయ భక్త బృందం భక్తుల ఏర్పాట్లు పర్యవేక్షించింది.

రథ సప్తమి వేడుకలకు సర్వంసిద్ధం


చిక్కవరం శ్రీ ఉషాపద్మినీ సమేత సూర్యనారాయణ స్వామి

గన్నవరంరూరల్: మండలంలోని చిక్కవరం శ్రీక్షేత్ర హనుమత్పురంలో శ్రీ ఉషాపద్మినీ సమేత సూర్యనారాయణ స్వామి దేవాలయం రథ సప్తమి వేడుకలకు సిద్ధమైంది. ఈ నెల 16వ తేదీ శుక్రవారం మాఘమాస రథ సప్తమి వేడుకలకు, శ్రీ సూర్య జయంతి నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశామని ఆలయ వ్యవస్థాపక ట్రస్టీ వంశీ తెలిపారు. శుక్రవారం జరిగే రథ సప్తమి వేడుకల్లో పాల్గొని స్వామివారిని దర్శించాలని కోరారు. ప్రభాత వేళ శ్రీ సూర్య నారాయణ స్వామిని సూర్య కిరణాలు తాకుతాయని, ఏటా పెద్ద సంఖ్యలో భక్తులు వీక్షిస్తారని చెప్పారు.

భక్తిశ్రద్ధలతో ఉపవాస దీక్షలు ప్రారంభం


మానికొండలో ప్రార్థనలు చేస్తున్న ఫాదర్ రత్నకిషోర్

ఉంగుటూరు: క్రైస్తవులు ఎంతో భక్తి శ్రద్ధలతో పాటించే 40 రోజుల తపస్సు కాలం బుధవారం నుంచి ప్రారంభమయ్యాయి. కతోలిక మత గురువులు విశ్వాసులకు విబూధిని నుదిటపైన సిలువ గుర్తు వేశారు. నేటి నుంచి పాస్కా మహోత్సవం వరకు భక్తిశ్రద్ధలతో ఉపవాస దీక్షను పాటిస్తారు. పలువురు తపస్కాల మాలను ధరించారు. పెదఅవుటపల్లిలో తంబి పుణ్యక్షేత్ర రెక్టర్ పాలడుగు జోసఫ్, విచారణ ఫాదర్లు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అదే విధంగా తేలప్రోలు, జోసఫ్‌నగర్, ఇందుపల్లి, మానికొండ, ఉంగుటూరు గ్రామాల్లో బుధవారం విబూధి ప్రార్థనల్లో పాల్గొన్నారు.

హనుమాన్‌జంక్షన్‌రూరల్: ఏసుక్రీస్తు సిలువపై ప్రాణాలు అర్పించిన శ్రమ కాలాన్ని ప్రతి క్రైస్తవుడు అత్యంత భక్తిశ్రద్ధలతో పాటించాలని జ్యోతినగర్ ఆర్సీఎం చర్చి ఫాదర్ చేబ్రోలు జోసఫ్ తంబి చెప్పారు. స్థానిక గుడివాడరోడ్డులోని జ్యోతినగర్ ఆర్సీఎం చర్చిలో క్రీస్తు శ్రమదినాల ప్రారంభాన్ని పురస్కరించుకుని బుధవారం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. 40 రోజుల పాటు క్రైస్తవులు కఠిన నియమ, నిబంధనలతో ప్రార్థించాలని, తద్వారా దేవునికి దగ్గర కాగలమని ఫాదర్ జోసఫ్ తంబి తెలిపారు. అనంతరం 80 మంది ఏసుక్రీస్తు దీక్షను స్వీకరించారు. జేఎంజే సిస్టర్లు, ఉపదేశకులు, ప్యారిస్ కౌన్సిల్ సభ్యులు పాల్గొన్నారు.

విజయవాడరూరల్: భస్మ బుధవారాన్ని పురస్కరించుకొని గ్రామాల్లోని చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. 40 రోజుల పాటు ఆయా చర్చిల్లో ఉపవాస ప్రార్థనలు నిర్వహించడంలో భాగంగా మొదటి రోజు ప్రత్యేక ప్రార్థనలు ప్రారంభించారు. మండల పరిధిలోని సీఎస్ఐ, ఆర్సీఎం, బాప్టిస్టు, లూథరన్, అన్ని ప్రొటెస్ట్ సంఘాల్లో ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. పెద్ద సంఖ్యలో క్రీస్తు విశ్వాసులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలను నిర్మూలిస్తేనే ఉత్తమ సమాజం


అవగాహన కల్పిస్తున్న జమాఅతె ఇస్లామి హింద్ సభ్యులు

కృష్ణలంక(విజయవాడతూర్పు): మత్తు పదార్థాలను నిర్మూలించి ఉత్తమ సమాజాన్ని నిర్మించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని జమాఅతె ఇస్లామి హింద్ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు జాహెదా బేగం అన్నారు. కృష్ణలంక, భ్రమరాంబపురంలోని బతా రాములు కొట్టు సెంటర్‌లో కౌసర్ మస్జీద్ వద్ద బుధవారం మాదక ద్రవ్యాల దుర్వినియోగంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జాహెదా బేగం మాట్లాడుతూ నేటి యువత మత్తు పదార్థాలకు బానిసలై విలువైన జీవితాన్ని నాశనం చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మత్తు పదార్థాలను నిర్మూలిద్దాం.. ఉత్తమ సమాజాన్ని నిర్మిద్దాం అనే నినాదంతో ఈ నెల 8 నుంచి 18వ తేదీ వరకు రాష్ట్ర వ్యాప్త ఉద్యమం చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో జమాఅతె ఇస్లామి హింద్ రాష్ట్ర సహాయ కార్యదర్శి షహనాజ్ సుల్తానా, విజయవాడ తూర్పు మహిళా అధ్యక్షురాలు నగీనా అఖ్తర్, తాహెరా, ఖాలిదా, సాదిఖా, రుక్సానా తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

విద్యార్థులకు అల్పాహారం పంపిణీ



ఉయ్యూరు: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల విద్యోన్నతికి రక్ష ఫౌండేషన్ కృషి చేస్తోందని డీసీఎంఎస్ చైర్‌పర్సన్, ఫౌండేషన్ చైర్‌పర్సన్ పడమట స్నిగ్ధ అన్నారు. మండలంలోని ఆకునూరు ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు అల్పాహార పంపిణీ కార్యక్రమం బుధవారం ప్రారంభించారు. పడమట స్నిగ్ధ మాట్లాడుతూ నెల రోజులు పాటు విద్యార్థులకు అల్పాహారం అందిస్తామన్నారు. గత 14 ఏళ్లుగా రక్ష ఫౌండేషన్ పెనమలూరు నియోజకవర్గంలో ప్రజలకు వివిధ సేవలు అందిస్తోందని చెప్పారు. ఫౌండేషన్ వ్యవస్థాపకుడు పడమట సురేష్‌బాబు స్ఫూర్తితో సామాజిక సేవా కార్యక్రమాలు కొనసాగిస్తామన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సలోమి, వైఎస్సార్ సీపీ నాయకుడు మెరుగుమాల ఏసుబాబు తదితరులు పాల్గొన్నారు.

నేడు విశ్రాంత ఉద్యోగుల సేవాభవన్‌లో వైద్యశిబిరం

గన్నవరం: స్థానిక బుద్ధవరం రోడ్డులోని విశ్రాంత ఉద్యోగుల సేవాభవన్‌లో గురువారం ఉచిత వైద్యశిబిరం ఏర్పాటు చేసినట్లు రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు ఆవుటపల్లి మోహన్‌రావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. విజయవాడకు చెందిన మాక్స్‌విజన్ కంటి ఆస్పత్రి, కృష్ణసాయి దంత వైద్యశాల, ఈఎన్‌టీ వినికిడి సంబంధిత వైద్యల పర్యవేక్షణలో పరీక్షలు నిర్వహిస్తారన్నారు. వైద్య సేవలు కోసం వచ్చే విశ్రాంత ఉద్యోగులు తమ ఐడీ కార్డులతో శిబిరానికి హాజరుకావాలని కోరారు.

మహిళపై దౌర్జన్యం చేసిన వారిపై కేసు నమోదు

పెనమలూరు: మహిళపై దౌర్జన్యం చేసిన పలువురు వ్యక్తులపై పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ టీవీవీ రామారావు తెలిపిన వివరాల ప్రకారం పెనమలూరులో గ్రామంలో జి.పద్మజ గ్రూప్‌హౌస్‌లో నివాసం ఉంటుంది. అదే గ్రూప్‌హౌస్‌లో ఉంటున్న చందు రాజేశ్వరరావు, రూప, జగదీష్‌తో పాటు మరి కొందరు వ్యక్తులు పాత గొడవల కారణంగా పద్మజ, ఆమె కుటుంబ సభ్యులపై దౌర్జన్యం చేశారు. ఈ ఘటనపై బాధితురాలు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. దీంతో పోలీసులు కేసు నమోదు చేశారు.

వ్యాన్‌లో తరలిస్తున్న రేషన్ బియ్యం స్వాధీనం

కంకిపాడు: అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని కంకిపాడు పోలీసులు మంగళవారం అర్ధరాత్రి స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఐ డి.సందీప్ తెలిపిన కథనం మేరకు... పునాదిపాడు ఫ్లై ఓవర్ వద్ద వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా ఓ వ్యాన్‌లో బియ్యం గుర్తించారు. వాటిని పరిశీలించగా రేషన్ బియ్యంగా తేలింది. దీంతో వాహనంలో తరలిస్తున్న 12 క్వింటాళ్ల రేషన్ బియ్యం, వ్యాన్‌ను సీజ్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. పౌరసరఫరాల శాఖ అధికారులకు సమాచారం అందించారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సందీప్ తెలిపారు.

192 మందికి వైద్య పరీక్షలు



ఉంగుటూరు: నారయ్య అప్పారావుపేటలో తేలప్రోలు ఉషారామ ఇంజినీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం విద్యార్థుల ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్యశిబిరాన్ని బుధవారం నిర్వహించారు. 192 మంది గ్రామస్తులకు గుండె, కిడ్నీ, షుగరు, బీపీ, ఈసీజీ, 2డీ ఎకో పరీక్షలు చేశారు. గ్రామంలో పేదలకు ఉచిత వైద్యం, పలు అంశాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఉషారామ విద్యార్థులను సర్పంచ్ నాగరాజు అభినందించారు. కార్యక్రమంలో విజయవాడ ఆంధ్రా హాస్పిటల్స్ గుండె, కిడ్నీ వైద్య నిపుణులు డాక్టర్ అచ్యుతబాబు, రమేష్, అమరావతి కంటి ఆస్పత్రి డాక్టర్ వేణు, మహిత దంత వైద్యశాల డాక్టర్ ఎస్.వరుణ్ ప్రియాంక వైద్య పరీక్షలు చేశారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ అధికారి వి.శ్రీహరి బాబు పాల్గొన్నారు.

రైతుల ఆందోళనను విజయవంతం చేయాలి

పెనమలూరు: ప్రధాని మోడీ ప్రభుత్వ వైఫల్యాలపై దేశవ్యాప్తంగా రైతులు, కార్మికులు ఈ నెల 16న చేపట్టిన ఆందోళనను విజయవంతం చేయాలని సీపీఎం నాయకుడు షేక్.కాశిం పిలుపు ఇచ్చారు. తాడిగడపలోని సీఐటీయూ కార్యాలయంలో బుధవారం రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. కాశిం మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం పెత్తందారులకు అండగా ఉండి రైతులు, పేద, కార్మిక వర్గాలకు తీరని అన్యాయం చేస్తుందన్నారు. ఆందోళనకు అన్ని వర్గాలు మద్దతు ఇవ్వాలని కోరారు. సమావేశంలో సీపీఎం, సీపీఐ, బీఎస్పీ, కాంగ్రెస్, ప్రజాసంఘాల నేతలు పాల్గొన్నారు.